క్లుప్తంగా

బోనాలకు సర్వం సిద్ధం


తుక్కుగూడలో అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన స్వాగత కమాన్

తుక్కుగూడ: ఆషాఢమాసం పురస్కరించుకొని మున్సిపల్ పరిధిలోని తుక్కుగూడ, మంఖాల్, రావిర్యాల, ఇమామ్‌గూడ తదితర గ్రామాల్లో మాంకాలమ్మ బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. ప్రతీ సంవత్సరం ఆషాఢంలో రెండో ఆదివారం ఉత్సవాలు చేయడం ఇక్కడ ఆనవాయితీ. ఈ నేపథ్యంలో మున్సిపల్ వ్యాప్తంగా జరిగే ఉత్సవాలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఆలయాలకు రంగులు, విద్యుత్ అలంకరణ, భక్తులకు ఇబ్బందులు రాకుండా భారీ కేడ్లను ఏర్పాటు చేశారు. ఆలయాల వద్ద ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ ఏ.వాణి శనివారం పరిశీలించారు.

వైభవంగా ఆషాఢ ఉత్సవాలు


ఎల్లమ్మ తల్లికి పూజలు చేస్తున్న అర్చకులు

తుక్కుగూడ: మున్సిపల్ పరిధిలోని జెన్నాయిగూడెం శ్రీలక్ష్మీనర్సింహాస్వామి ఆలయంలో శనివారం వైభవంగా ఆషాడ మాస ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లమ్మ అమ్మవారికి ప్రత్యేకలంకరణ, పూజలు చేశారు. అనంతరం సహస్త్ర కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు మురళీశర్మ, అజయ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కందుకూరు: మండలంలోని నేదునూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ వేణుగోపాల్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ నేదునూరు ఫీడర్, 11కేవీ బాచుపల్లి ఫీడర్ల పరిధిలో చెట్లకొమ్మలు తొలగించే పనులు చేపట్టనున్నామని, దీనికి గాను ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, తిరిగి సాయంత్రం 3 గంటల నుంచి 5.30 గంటల మధ్య విద్యుత్ సరఫరా ఉండదన్నారు. నేదునూరు టౌన్, మాన్యగూడ, బాచుపల్లి, పెరుగూడ గ్రామాల్లో ఆయా సమయాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రోడ్లు, భూగర్భ డ్రైనేజీల నిర్మాణానికి కృషి

టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి


కాలనీల ప్రతినిధులతో మాట్లాడుతున్న నర్సింహబూరెడ్డి

మీర్‌పేట: కాలనీల్లో అవసరమున్నచోట రోడ్లు, భూగర్భ డ్రైనేజీల నిర్మాణాలకు చర్యలు తీసుకుంటానని టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి అన్నారు. శనివారం కార్పొరేషన్ పరిధిలోని విజ్ఞానపురి, న్యూనందిహిల్స్, ప్రశాంతిహిల్స్, డీఎల్ఆర్ఎల్ కాలనీల్లో ఆయన పర్యటించి కాలనీల ప్రతినిధులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను కాలనీవాసులు నర్సింహారెడ్డికి వివరించారు. వన మహోత్సవంలో భాగంగా డీఎల్ఆర్ఎల్ కాలనీలో ఆయన మొక్కను నాటారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ముద్దా పవన్‌కుమార్, కీసర హరినాథ్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, కృష్ణ, ప్రవీణ్‌రెడ్డి, మురళీగౌడ్ తదితరులు ఉన్నారు.

ఎస్ఐకి సన్మానం


ఎస్ఐ జానీకి జ్ఞాపిక అందజేస్తున్న ఇన్‌స్పెక్టర్ సుధాకర్

పహాడీషరీఫ్: పోలీస్ అధికారులు తాము పనిచేసిన చోట ప్రజల మనసులు చూరగొనేలా విధులు నిర్వహించాలని బాలాపూర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుధాకర్ అన్నారు. స్టేషన్‌లో మూడేళ్ల పాటు ఎస్ఐగా పనిచేసి వనస్థలిపురం ఠాణాకు బదిలీపై వెళ్తున్న జానీకి శనివారం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అయనను సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఇదే క్రమంలో కొత్తగా ఈ ఠాణాకు నూతనంగా ఎస్ఐలుగా వచ్చిన ఎం.నవీన్‌కుమార్, మహ్మద్ సొహేల్‌లకు శుభాకాంక్షలు తెలియజేశారు.

వన మహోత్సవానికి సన్నద్ధం

- లక్ష్యం మేరకు మొక్కలు రెడీ
- ఇప్పటికే స్థలాల గుర్తింపు
- పకడ్బందీగా చేపట్టేందుకు సన్నాహాలు


ఇమామ్‌గూడ అటవీ శాఖ కార్యాలయంలోని నర్సరీ

తుక్కుగూడ: పర్యావరణ పరిరక్షణ, అడవుల పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమానికి అటవీ శాఖ యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ఈ ఏడాది భారీగా మొక్కలు నాటేందుకు ప్రణాళిక చేసింది. ఇందుకు మంఖాల్ ఫారెస్టు రేంజ్ పరిధి మహేశ్వరం, కందుకూరు, ఇబ్రహీంపట్నం మండల్లాలోని అటవీ భూములను గుర్తించింది.

టార్గెట్ 80 వేలు

మంఖాల్ ఫారెస్టు రేంజ్ ఆధ్వర్యంలో ఈ ఏడాది 80 వేల మొక్కలను నాటేందుకు అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. వర్షాధారిత మొక్కలైన వేప, మద్ది, టేకు, అల్లనేరడు, మామిడి, చింత, కానుగు తదితర మొక్కలను నాటుతున్నారు. ఇప్పటి వరకు కురిసిన వర్షాలకు 18 వేల మొక్కలను నాటారు. మిగతావాటికి గుర్తించిన ప్రదేశంలో గుంతలు తీసి ఉంచారు. ప్రస్తుతం సరైన వర్షాలు లేని కారణంగా కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేశారు. నాటిన మొక్కలకు సంరక్షణ చర్యలు చేపడుతున్నారు.

30 రకాల మొక్కలు

వన మహోత్సహంలో భాగంగా మొక్కలు నాటడానికి తుక్కుగూడ పురపాలిక పరిధి ఇమామ్‌గూడ అటవీశాఖ కార్యాలయంలో నర్సరీని ఏర్పాటు చేశారు. ఇందులో 30 రకాల మొక్కలను పెంచారు. మూడు నెలల క్రితం మొక్కల విత్తనాలను విత్తారు. ప్రస్తుతం మొక్కలు పెరిగి, నాటడానికి సిద్ధంగా ఉన్నాయి.

త్వరలో లక్ష్యం పూర్తి

ఈ ఏడాది వన మహోత్సవ లక్ష్యం 80 వేలు. ఇప్పటి వరకు మంఖాల్ ఫారెస్టు రేంజ్ పరిధిలో 18 వేల మొక్కలు నాటాము. ప్రస్తుతం వర్షాలు లేని కారణంగా తాత్కాళికంగా కార్యక్రమాన్ని వాయిదా వేశాం. వానలు కురవగానే మిగతా మొక్కలు నాటుతాం.

– ప్రభాకర్, మంఖాల్ ఫారెస్టు రేంజ్ అధికారి


అధికారులతో రోడ్డు విస్తరణపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

రోడ్డు విస్తరణకు సహకరించాలి

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి
- అధికారులతో కలిసి నాదర్‌గుల్ రోడ్డు పనుల పరిశీలన

బడంగ్‌పేట్: ఇప్పటికే మూడుసార్లు వాయిదా పడి రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న నాదర్‌గుల్ రోడ్డు విస్తరణ పనులకు పార్టీలకతీతంగా నాయకులు సహకరించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి కోరారు. శనివారం గాంధీనగర్ టూ నాదర్‌గుల్ రోడ్డు విస్తరణ పనులను అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నాదర్‌గుల్ రోడ్డు విస్తరణకు గతంలో హెచ్ఎండీఏ నిధుల నుంచి రూ.9 కోట్లు మంజూరు చేయించానని స్పష్టం చేశారు. అల్మాస్‌గూడ, లెనిన్‌నగర్ ఇతర లింక్ రోడ్లను విస్తరణ చేశామన్నారు. రోడ్డు మధ్యలో సింగిల్ డివైడర్‌ను ఏర్పాటు చేశామన్నారు. నాదర్‌గుల్ రోడ్డు రెండేళ్లుగా రోడ్డు విస్తరణ పనులకు అనేక అడ్డంకులు వచ్చాయని, ఇప్పుడు అన్ని తొలగిపోయి విస్తరణ పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. రోడ్డుకు ఇరువైపులా 75 చెట్లను గుర్తించి నంబరింగ్ వేశామని వెల్లడించారు. గుర్తించిన చెట్లను ఫారెస్ట్ అధికారులకు తెలుపగా వారు వచ్చే వారంలో చెట్లను షిఫ్ట్ చేస్తారన్నారు. అలాగే ఇరువైపులా విస్తరణకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించేందుకు సంబంధిత అధికారులకు రూ.52లక్షల చెక్కును అందిస్తున్నామన్నారు. విస్తరణలో భాగంగా ఒకవైపు డ్రైనేజీ ఉందని, పెద్ద డ్రైనేజీ సిమెంట్ పైపులు వేసేందుకు అదనంగా మరో రూ.50 లక్షలు మంజూరి చేశామన్నారు. సెంట్రల్ లైటింగ్ సిస్టం కూడా ఉందని, సింగిల్ డివైడర్‌ను ఏర్పాటు చేసి విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తామన్నారు. నీరు నిల్వ ఉండకుండా బోనాల పండుగకు అటు ఇటుగా రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను కోరారు. ప్రతి ఒక్కరూ రాజకీయాలకతీతంగా సహకరించాలన్నారు. ఏళ్లుగా ఇబ్బంది పడుతున్న ప్రజల బాధలు అర్థం చేసుకొని రోడ్డు విస్తరణను రాజకీయం చేయకుండా నాదర్‌గుల్ గ్రామస్తులు అందరూ సహకరించి పనులు త్వరగా పూర్తి చేసేలా చూసే బాధ్యత అందరిదన్నారు. కార్యక్రమంలో డీఈఈ వెంకన్న, విద్యుత్ డీఈఈ శ్రీనివాస్, ఫారెస్ట్ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ పాండుయాదవ్, నాయకులు

బీసీలపై కాంగ్రెస్ కపట ప్రేమ

- 42 శాతం రిజర్వేషన్లతో స్థానిక ఎన్నికలను నిర్వహించాలి
- పీఏసీఎస్ చైర్మన్ మంచె పాండుయాదవ్

మహేశ్వరం: కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లతో స్థానిక ఎన్నికలను నిర్వహించాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మహేశ్వరం పీఏసీఎస్ చైర్మన్ మంచె పాండుయాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ బీసీ నేతల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికల్లో బీసీ ఓట్లను గంపగుత్తగా లబ్ధిపొందేందుకు కాంగ్రెస్ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని మాయమాటలు చెబుతోందన్నారు. బీసీలపైన కాంగ్రెస్ కపట ప్రేమ చూపిస్తోందన్నారు. కేంద్రంలో బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ప్రయత్నం చేయకపోవడం ఆశ్చర్యకరమన్నారు. 9వ షెడ్యూల్‌లో పెట్టకుండా 70 శాతం రిజర్వేషన్లు ఎలా అమలవుతాయని ప్రశ్నించారు. బీసీల రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ సర్కార్ ఘరానా మోసానికి పాల్పడుతోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో మహారాష్ట్ర, తమిళనాడు, బీహార్ రాష్ట్రాల్లో కూడా ఇలాగే జీఓ జారీ చేస్తే అవి కోర్టులో నిలబడలేదని గుర్తు చేశారు. బీసీల మనోభావాలు దెబ్బతీసే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. స్థానిక ఎన్నికల పేరుతో బీసీలను మోసం చేయాలని కాంగ్రెస్ యత్నిస్తోందన్నారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బీసీల పక్షాన పెద్దఎత్తున ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ పోతర్ల అంబయ్యయాదవ్, శివగంగ ఆలయ కమిటీ చైర్మన్ మునగపాటి నవీన్, పీఏసీఎస్ డైరెక్టర్లు పోల్కం బాలయ్య, కడమోని ప్రభాకర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కర్నాటి మనోహర్, బండారి లింగం ముదిరాజ్, వెంకటేశ్‌యాదవ్, దేవవరంగౌడ్, రమేశ్, రఘుపతి పలువురు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం

మలక్‌పేట: ఆంధ్ర తెలంగాణ ఒరిస్సా ఆర్చ్ డయోసిస్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కాంకార్డియా యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. హౌస్ ఆఫ్ జీసస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాన ఆర్చ్ బిషప్, సినమ్ అధ్యక్షులు మోస్ట్ రెవరెండ్ డాక్టర్ రాబిన్‌సన్ డేవిడ్ లూథర్ చేతుల మీదుగా మలక్‌పేటకు చెందిన పాస్టర్ సునీతకు డాక్టరేట్ ప్రదానం చేశారు.

ధ్యానాంజనేయ స్వామికి సీఎం సోదరుడి పూజలు

చంపాపేట: చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామివారిని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డి శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు కొండల్‌రెడ్డిని ఆశీర్వదించి స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ లావణ్య, తోకటి కిరణ్, కవిత ఉన్నారు.

వృద్ధాశ్రమం సందర్శన


వృద్ధుల ఆరోగ్య స్థితిగతులను తెలుసుకుంటున్న ఇన్‌స్పెక్టర్ సుధాకర్

పహాడీషరీఫ్: వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను చిన్నపిల్లల మాదిరిగా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుధాకర్ అన్నారు. ప్రజలతో మమేకం (కమ్యూనిటీ అవుట్ రీచ్)లో భాగంగా ఎర్రకుంట జమాలబండలోని నారీ నికేతన్ వృద్ధాశ్రమాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వృద్ధులతో మాట్లాడిన ఆయన వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వారికి తినుభండారాలను అందజేశారు. ఆశ్రమ నిర్వాహకులకు అభినందనలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు భద్రత, రక్షణ కల్పించే పోలీసులు వారితో మమేకం కావడం ద్వారా మరింత భరోసా కల్పించినట్లవుతుందన్నారు. ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండడం ద్వారా నేరాలు తగ్గుముఖం పట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎస్.వీ.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి


ముస్తాబైన దుర్గమాత ఆలయం

పహాడీషరీఫ్: మున్సిపాలిటీలోని శ్రీరాం కాలనీలో ఆదివారం ఆషాఢమాసం బోనాలను పురస్కరించుకొని నిర్వాహకులు ఆలయాలను ముస్తాబు చేశారు. ప్రధానమైన పోచమ్మ దేవాలయంతో పాటు దుర్గమాత ఆలయం, కార్గో రోడ్డు సమీపంలోని ముత్యాలమ్మ ఆలయాలకు రంగులు వేసి విద్యుద్దీపాలతో అలంకరించారు. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా మున్సిపల్ తరఫున ఆలయ పరిసరాల్లో ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఉదయం గ్రామ దేవతలకు బోనాల సమర్పణ, సోమవారం రోజున తొట్టెల ఊరేగింపు కొనసాగనుంది. ఈ ఉత్సవాల్లో ఆయా రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు కూడా హాజరుకానున్నారు. బోనాల సందర్భంగా పహాడీషరీఫ్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

మొక్కలతోనే మానవ మనుగడ


మొక్కలు నాటుతున్న మాజీ ఎంపీటీసీ షేక్ అఫ్జల్

పహాడీషరీఫ్: మానవాళి మనుగడ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని జల్‌పల్లి మాజీ ఎంపీటీసీ సభ్యుడు షేక్ అఫ్జల్ అన్నారు. వాదే హుదాలోని జమాతే ఇస్లామీ హిందూ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వన మహోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోజురోజుకు పెరుగుతున్న కాలుష్యంతో మనుషులకు ప్రాణవాయువు కష్టతరంగా మారుతోందన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు అబ్దుల్ మజీద్, ఎమ్మార్పీఎస్ జల్‌పల్లి ఇన్‌చార్జి యంజాల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి


పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ అరుణ రవీందర్‌రెడ్డి

సైదాబాద్: డివిజన్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి సూచించారు. సైదాబాద్ బస్తీలోని నాగులమ్మ దేవాలయం వద్ద నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను శనివారం కార్పొరేటర్ పరిశీలించారు. సీసీ రహదారి పనులతో డ్రైనేజీల మ్యాన్‌హోళ్లు ధ్వంసమయ్యాయని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించిన ఆమె పనులు పూర్తయ్యేలోపు మ్యాన్‌హోళ్లను సరి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. సైదాబాద్‌లోని ఆయా ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో స్థానికులు భాగస్వాములు కావాలన్నారు.

ఆలయాలను సుందరంగా తీర్చిదిద్దాలి


దేవాలయంలో అభివృద్ధి పనులు ప్రారంభించిన శ్వేతామధుకర్‌రెడ్డి

సైదాబాద్: బోనాల మహోత్సవాలు పురస్కరించుకొని అమ్మవారి ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి సూచించారు. ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని ఎస్ఎన్ రెడ్డినగర్‌లోని శ్రీరేణుకా ఎల్లమ్మ దేవాలయంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను శనివారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. బోనాల సందర్భంగా పెద్దసంఖ్యలో తరలివచ్చే భక్తుల కోసం ఆలయాల వద్ద సౌకర్యాలు కల్పించాలన్నారు. భక్తుల కోసం క్యూలైన్లు, తాగునీటి వసతులు ఏర్పాటు చేయాలన్నారు. ఆలయాల పరిసరాల్లో మెరుగైన పారిశుద్ధ్యం కోసం తగిన చర్యలు తీసుకోవాలని ఆలయాల కమిటీల ప్రతినిధులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మధుకర్‌రెడ్డి, మురళీధర్‌రావు, కృష్ణారావు, ఆనంద్, జగన్‌రెడ్డి, అంజయ్య, సరస్వతి, మాధవి, దీపిక పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ సిబ్బందిని క్రమబద్ధీకరించాలి


నిరసన తెలుపుతున్న అవుట్ సోర్సింగ్ సిబ్బంది

వనస్థలిపురం: అవుట్ సోర్సింగ్ వ్యవస్థను రద్దు చేయాలని, అవుట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న సిబ్బందిని వెంటనే క్రమబద్ధీకరించాలని తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ అవుట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ ట్రేడ్ యూనియన్ అసోసియేట్ ప్రెసిడెంట్ శాంతికుమార్‌గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం తెలంగాణ రాష్ట్ర అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపుమేరకు ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వహిస్తున్న అన్ని విభాగాల ఉద్యోగుల మహా ధర్నాకు సంఘీభావంగా వనస్థలిపురం ఏరియా ఆసుపత్రి వద్ద ఏరియా ఆసుపత్రి సిబ్బంది, వెల్‌నెస్ సెంటర్ సిబ్బంది నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు.ఈ కార్యక్రమంలో డాక్టర్లు హీబా, అనిత, ఫార్మసిస్టులు జగదీష్, నాగరాజు, వాసవి, ప్రసన్న, డీఈవోలు దిలీప్, సంధ్య, సరిత, భార్గవి, సిబ్బంది నర్సింగ్, నరసింహారెడ్డి, అనిల్, ఫయాజ్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

దిల్‌సుఖ్‌నగర్: ఆరోగ్యం పట్ల అందరూ జాగ్రత్తలు తీసుకోవాలని చిత్రలేవుట్ కాలనీ వాకర్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు ఇంద్రసేనరెడ్డి, రామచంద్రరావు అన్నారు. శనివారం ఆర్‌కేపురం డివిజన్ చిత్రలేవుట్ కాలనీ పార్క్‌లో ఇంటర్నేషనల్ వాకర్స్‌క్లబ్, చిత్రలేవుట్ 301 చార్టర్ ఆధ్వర్యంలో ముత్తూడ్ ఫైనాన్స్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు ఆరు నెలలకోసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రతిరోజు వ్యాయామం చేయాలన్నారు.

ఆలయంలో ఫ్లోరింగ్ పనులు ప్రారంభం

చాదర్‌ఘాట్: మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల మంజూరు చేయించిన రూ. 2.50 లక్షల నిధులతో ఓల్డ్‌మలక్‌పేటలోని శ్రీపోచమ్మ దేవాలయంలో ఫ్లోరింగ్ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ.. ఆలయంలో మరమ్మతు పనుల కోసం ఎమ్మెల్యే బలాల, ఓల్డ్‌మలక్‌పేట కార్పొరేటర్ షఫి సహకరించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శంకర్ ముదిరాజ్, తులసి సురేష్‌కుమార్, కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, ముప్పిడి శ్రీనివాస్, చౌకి రవికుమార్, శ్రీధర్ ముదిరాజ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి

నాగోలు: నాగోలు డివిజన్ పరిధిలోని ఆనంద్‌నగర్ రోడ్ నెంబర్ 4లో వేలాడుతున్న విద్యుత్ తీగల సమస్యను పరిష్కరించాలని నాగోలు బీజేవైఎం జనరల్ సెక్రటరీ శ్రీనారాయణం తారల్‌శర్మ, నాగోలు డివిజన్ బీజేపీ అధ్యక్షులు పంగా శ్రీకాంత్ నాగోలు డివిజన్ అసిస్టెంట్ ఇంజనీర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఆనంద్‌నగర్‌లో తరుచూ విద్యుత్ తీగలు వేలాడుతూ ప్రమాదకరంగా మారుతున్నాయని వెంటనే సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలన్నారు.